ఈనాడు
మహబూబ్‌నగర్
శుక్రవారం అక్టోబరు 25, 2024



# అద్దెలు చెల్లించని దుకాణాలపై కొరడా



పోలీసుల సహకారంతో క్లాక్‌టవర్ కూడలిలో దుకాణాలు మూస్తున్న పురపాలక అధికారులు

**పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే :** పురపాలికకు చెందిన దుకణాల అద్దెలు చెల్లించకుండా మొండికేసిన వ్యాపారులపై పురపాలక శాఖ రెవెన్యూ విభాగం గురువారం కొరడా ఝుళిపించింది. రెవెన్యూ విభాగం సిబ్బంది పోలీసుల సహాయంతో వ్యాపారులను బయటకు పంపించి దుకాణాలను మూసి సీజ్ చేశారు. క్లాక్‌టవర్ కూడలిలో పురపాలక సంఘానికి చెందిన 14 దుకాణాల్లో వ్యాపారాలు కొనసాగిస్తున్న యజమానులు 2017 నుంచి నెలవారి అద్దెలు సరిగ్గా చెల్లించడం లేదు. ఒక్కో వ్యాపారి పురపాలక సంఘానికి రూ. 40 లక్షలకు పైగా అద్దె బకాయిలు చెల్లించాల్సి ఉంది. పలుమార్లు గడువు విధించినా అద్దెలు సక్రమంగా చెల్లించలేదు. ఇటీవల రెవెన్యూ వసూళ్లపై సమీక్ష జరిపిన అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ వెంటనే బకాయిలు వసూలు చేయాలని, లేదంటే దుకాణాలు సీజ్ చేయాలని కమిషనర్‌ను, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఆదేశాలతో ఆర్వో ఎండీ.ఖాజా ఆధ్వర్యంలో ఆర్ఐలు అహ్మద్ షరీఫ్, పెంటయ్య, రమేశ్, ఎండీ ముజీబ్ తదితరులు పోలీసుల సహాయంతో గురువారం క్లాక్‌టవర్ ఏరియాలో పురపాలక సంఘానికి చెందిన దుకాణాల వద్దకు చేరుకొని వ్యాపారులను అద్దెలు ఇవ్వాలని కోరారు. అద్దెలు ఇవ్వకపోవడంతో వ్యాపారులను బయటకు రప్పించి ఆరు దుకాణాలను మూసి సీజ్ చేశారు.




దుకాణాలకు సీల్ వేస్తున్న సిబ్బంది

# నిధుల మంజూరుకు నిరీక్షణ!

బస్టాండులోని నాలా త్వరగా తొలగించాలంటున్న ప్రయాణికులు

ఈనాడు మీ తోడు

**న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం :** మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండు గుండా ప్రవహిస్తున్న పెద్ద చెరువు నాలాను త్వరగా దారి మళ్లించాలని ప్రయాణికుల నుంచి డిమాండ్ పెరుగుతోంది. ఇందుకు అవసరమైన నిధుల మంజూరు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. బస్టాండులోకి రాగానే ముక్కుపుటాలదిరే దుర్గంధంతో ప్రయాణికులు పాతికేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల పరిస్థితి మరీ దయనీయం. అటు డిపోకు, ఇటు బస్టాండుకు మధ్య పెద్దచెరువు నాలా ప్రవహిస్తుండటం వల్ల అటు దుర్వాసన, ఇటు దోమల స్వైరవిహారంతో ఉద్యోగులు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఈ సమస్యలపై 'ఈనాడు' వరుస కథనాలు ప్రచురించింది. స్పందించిన పురపాలక ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఓసారి ఆర్టీసీ బస్టాండును సందర్శించి పెద్దచెరువు నాలా వల్ల ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందించారు.



బస్టాండు నుంచి దారి మళ్లించి పెద్దచెరువు వైపు నాలా నిర్మించాల్సిన ప్రాంతమిదే

బస్టాండు ఆవరణ నుంచి పారుతున్న నాలాను దారి మళ్లించే ప్రక్రియ వేగవంతం చేయాలని, అందుకు అంచనాలు రూపొందించి డీఎంఏకు పంపించాలని ఇంజినీరింగ్ అధికారులను ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఇంజినీరింగ్ అధికారులు కూడా సెప్టెంబర్ మొదటి వారంలో బస్టాండులోని నాలా వద్దకు వెళ్లి దాన్ని ఎటు వైపు నుంచి పెద్దచెరువులోకి మళ్లించాలో పరిశీలించారు. అంబేడ్కర్ నగర్‌లో కమ్యూనిటీ భవనం పక్క నుంచి ఆర్టీసీ డిపో ప్రహరీ వెలుపల గుండా పెద్ద చెరువు వైపు నాలా నిర్మించేందుకు రూ. 2కోట్లు ఖర్చవుతాయని అంచనాలు రూపొందించారు. ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 9వ తేదీనే రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకుల కార్యాలయం(సీడీఎంఏ)కు ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటికి 44 రోజులు గడిచాయి. నిధులు త్వరగా మంజూరు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### ఆర్టీసీ నుంచీ చొరవ..

ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్(ఆర్ఎం) శ్రీదేవిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా బస్టాండు గుండా ప్రవహిస్తున్న నాలా తొలగింపునకు ఆర్టీసీ పరంగా పురపాలక సంఘానికి పూర్తిగా సహకారం అందిస్తామని స్పష్టంచేశారు. నాలా తొలగించేందుకు అంచనాలు రూపొందించి రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులకు ప్రతిపాదనలు పంపడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఆర్టీసీ పరంగా తమశాఖ ఇంజినీరింగ్ విభాగం నుంచి కూడా సీడీఎంఏకు సిఫారసు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రయాణికులు, ఉద్యోగులు నాలా వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను అవసరమైతే తమ సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు త్వరితగతిన మంజూరు అయ్యేలా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.

# వెంచర్‌లో రాత్రింబవళ్లు వెలుగులు

- మీటరు లేకుండా నేరుగా తీగలకు కనెక్షన్
- విద్యుత్తు శాఖకు భారీగా నష్టం

నిఘా

**పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే :** మహబూబ్‌నగర్ సమీప తిరుమల హిల్స్ ప్రాంతంలో వెలసిన ఖరీదైన వెంచర్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్తు శాఖ అనుమతి తీసుకుని మీటరు ఏర్పాటు చేసి విద్యుత్తు దీపాలు బిగించడానికి అనుకుంటే ఇప్పుడే కాలేసినట్లే. ఈ ప్రాంత విద్యుత్తు సిబ్బంది స్థిరాస్తి వ్యాపారులతో కుమ్మక్కై, ఎలాంటి అనుమతులు లేకుండానే వెంచర్‌లోని ప్రధాన రహదారి పొడవునా, అంతర్గత రోడ్ల వెంట స్తంభాలు వేసి తీగలకు కనెక్షన్ ఇచ్చి ఎల్‌ఈడీ విద్యుద్దీపాలను బిగించడం గమనార్హం. ఈ అక్రమ వ్యవహారం జరిగిన ప్రారంభమైందని కుంటే పాపాలే. రెండేళ్లుగా అక్రమంగా విద్యుత్తు వాడుకుంటున్నారంటే ప్రభుత్వ ఖజానాకు ఏ స్థాయిలో గండి కొట్టారో అర్థం చేసుకోవచ్చు. 2.32 ఎకరాల విస్తీర్ణంలో 41 ప్లాట్లతో, బీటీ రహదారులతో 2022లో ఇక్కడ ఈ వెంచర్ ఏర్పాటు చేశారు. ఏ ఒక్క ప్లాటులో ఇళ్ల నిర్మాణం జరగలేదు. తమ వ్యాపార వృద్ధికి వెంచర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చూపడానికి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే విద్యుత్తు స్తంభాలను ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా విద్యుత్తు శాఖకు తీవ్ర నష్టం కలిగిస్తున్నా ఆ శాఖ ఉన్నతాధికారులు ఇక్కడి వెంచర్‌పై దృష్టి సారించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణాలు, పల్లెలు, జనావాసాల మధ్య విద్యుద్దీపాలు లేక జనం ఇబ్బందులు పడుతుంటే.. ఇక్కడి వెంచర్లో మాత్రం ఇళ్లు లేకున్నా ఖాళీ ప్లాట్లలో రాత్రింబవళ్లు విద్యుద్దీపాలు వెలుగుతుండటం గమనార్హం. విద్యుత్తు శాఖ అధికారులు ఈ వ్యవహారంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



తిరుమల హిల్స్‌లోని వెంచర్‌లోని రహదారి పొడవునా వెలుగుతున్న విద్యుద్దీపాలు

## శ్రీశైలంలో 4 గేట్ల ద్వారా నీటి విడుదల

**శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే :** ఎగువ ప్రాంతం నుంచి నీటి ప్రవాహం పెరగడంతో శ్రీశైలం జలాశయం పూర్తిగా నిండింది. గురువారం 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,12,300 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుత్తు కేంద్రాల ద్వారా 67,876 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాయంత్రం 6 గంటలకు 885 అడుగుల (212.387 టీఎంసీలు)గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు నుంచి 70,552 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,18,776 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి చేరుతోంది.



# స్థానిక పోరుకు ముమ్మర ఏర్పాట్లు

జిల్లాలకు చేరిన కరదీపికలు

**మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే :** గ్రామ పంచాయతీ పాలకవర్గాలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం ముగిసింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్తులు, మండల పరిషత్తుల్లో ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. ఆయా స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న విషయంపై స్పష్టత లేకపోయినా అధికారులు ఎప్పుడు ఎన్నికల తేదీలని ప్రకటించినా నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లలో తలమునకలయ్యారు. బ్యాలెట్ పెట్టెలను సరిచూసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాల వారిగా బ్యాలెట్ పెట్టెల ఆవశ్యకత, మరమ్మతులు చేసేవి ఎన్ని అనే వివరాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల శిక్షణకు సంబంధించిన మాడ్యుల్స్, ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారులకు సంబంధించిన కరదీపికలు జిల్లాలకు చేరాయి. వాటితో పాటు వివిధ రకాల ఫారాలు కూడా వచ్చాయి.



మహబూబ్‌నగర్ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి చేరిన ఎన్నికల మాడ్యుల్స్, కరదీపికలు

**నాలుగు జిల్లాల్లో 6 కొత్త మండలాలు.. :** ఉమ్మడి పాలమూరులోని నాలుగు జిల్లాల్లో కొత్తగా మండలాలు ఏర్పడ్డాయి. ఈసారి జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో వీటిని పరిగణలోకి తీసుకుని మండల ప్రాదేశిక స్థానాలను పునర్విభజన చేయనున్నట్లు సమాచారం. తద్వారా రిజర్వేషన్లు కూడా మారనున్నాయి. జిల్లాలకు ఎన్నికల సామగ్రి చేరుతున్న నేపథ్యంలో బ్యాలెట్ పత్రాలు రావాల్సి ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తగా మహ్మదాబాద్, కౌకుంట్ల మండలాలు ఏర్పడ్డాయి. వనపర్తి జిల్లాలో ఏదుల, జోగులాంబ గద్వాల జిల్లాలో ఎర్రవల్లి, నారాయణపేట జిల్లాలో గుండుమాల్, కొత్తపల్లి ఇలా మొత్తం 6 కొత్త మండలాలు ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు పెరిగే ఆస్కారం ఉంది.

ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు, వార్డులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీల సంఖ్య, ఓటర్ల వివరాలు ఇలా..

| జిల్లా | పంచాయతీలు | ఎంపీటీసీలు | జడ్పీటీసీలు | ఎంపీపీలు | వార్డులు | పురుషులు | మహిళలు |
|---|---|---|---|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 441 | 168 | 16 | 16 | 3,836 | 2,57,529 | 2,58,647 |
| నాగర్‌కర్నూల్ | 464 | 212 | 20 | 20 | 4,140 | 3,23,705 | 3,22,689 |
| వనపర్తి | 260 | 128 | 15 | 15 | 2,366 | 1,83,382 | 1,84,135 |
| జోగులాంబ గద్వాల | 255 | 141 | 13 | 13 | 2,390 | 1,91,313 | 1,96,875 |
| నారాయణపేట | 280 | 147 | 13 | 13 | 2,544 | 1,98,199 | 2,05,547 |

### గోదాముల్లో ఎన్నికల సామగ్రి

ఉమ్మడి జిల్లాలో 1,700 పంచాయతీలు, 15,276 వార్డులు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో వార్డుల సంఖ్య పెరగడంతో పాటు ప్రతి వార్డుకు ఒక బ్యాలెట్ పెట్టె అవసరం కానుంది. ఈ లెక్కన గతంలో మాదిరిగానే మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడతలో ఉపయోగించిన బ్యాలెట్ పెట్టెలను తిరిగి రెండో, మూడో విడత ఎన్నికల్లోనూ ఉపయోగించుకోవచ్చు. విధులు నిర్వహించే సిబ్బంది శిక్షణకు అవసరమైన పుస్తకాలు, సామగ్రి చేరుకోవడంతో వాటిని గోదాముల్లో భద్రపరిచారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న కేంద్రాలు, వాటిలో సమస్యలు, కొత్తగా ప్రతిపాదించే కేంద్రాల్లో సమస్యలున్నాయా అనే దానిపై మండలాల వారీగా ఏర్పాటు చేసిన కమిటీలు పరిశీలించి ఇప్పటికే నివేదికను సమర్పించాయి. కొత్తగా మరికొన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశముంది. ప్రభుత్వం కుల గణనకు ఆదేశాలు జారీ చేయడం, దీనికి రెండు నెలలు గడవు ఇవ్వడంతో ఈ ఏడాదికి ఎన్నికలు లేనట్టేనని అధికారులు భావిస్తున్నారు. కులగణన పూర్తి చేసిన తర్వాత గత రిజర్వేషన్లను రద్దు చేసి కొత్తగా రిజర్వేషన్లను ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ ఉంది. ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవటంతో ఉత్కంఠ నెలకొంది.

# చెకుముకి సైన్స్ సంబరాలకు సన్నాహాలు

నవంబరు 7 నుంచి ప్రారంభం ● 8-10 తరగతుల విద్యార్థులు అర్హులు



పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు

**అచ్చంపేట, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 8-10 తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు ఈ పోటీలుంటాయి. ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని 8-10 తరగతులు చదువుతున్న విద్యార్థులు చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్షలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.


**పోటీల వివరాలు ఇలా:** విద్యార్థులకు మొదట పాఠశాల స్థాయిలో ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నారు. నవంబరు 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలు ఆదిలాబాద్‌లో డిసెంబరు 14-16 వరకు నిర్వహించనున్నారు. 8, 9, 10 తరగతులకు సంబంధించిన సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రం, సమకాలీన శాస్త్ర, సాంకేతిక అంశాలపై పోటీలుంటాయి. వీటిని తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తారు. అన్ని మండలాల విజేతలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి ఆయా జిల్లాల నుంచి ఎంపికైన విజేతలకు రాష్ట్రస్థాయికి పంపుతారు.

**రాష్ట్ర స్థాయిలో.. :** చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా రాష్ట్రస్థాయిలో సైన్స్ ప్రయోగాలు, సైన్స్ జాతర, మీట్ ది సైంటిస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు.



# ఫీజు బకాయిలు, ఉపకార వేతనాల విడుదలకు డిమాండ్

**జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే :** రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలు, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ ఉమ్మడి పాలమూరు విభాగ్ కన్వీనర్ నరేశ్, జిల్లా కన్వీనర్ సతీశ్ డిమాండ్ చేశారు. గురువారం జడ్చర్లలోని నేతాజీ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. కళాశాలల విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు సకాలంలో రాక రూ. 7500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. పేద విద్యార్థులు ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలపై ఆధారపడి చదువుతున్నారని, సకాలంలో విడుదల కాక విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ఆందోళనతో వాహనాలు నిలిచిపోగా సీఐ ఆదిరెడ్డి అక్కడికి చేరుకొని ఆందోళనకారులను రోడ్డుపై నుంచి పంపించారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్, మారుతి, శివ, వీరమోహన్, నవనీత్, అశోక్, శోభ, పద్మ, రాజు, రవీందర్, విజయ్, చందు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు

## నేడు జిల్లాకు ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు రాక

**పాలమూరు, న్యూస్‌టుడే :** రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం జిల్లా కేంద్రానికి వస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి రహదారిలోని ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాలలో ఏటీసీ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అనంతరం మెట్టుగడ్డ ప్రాంతంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో టాస్క్ కేంద్రం కోసం స్థల పరిశీలన చేస్తారని, తర్వాత రెడ్డి బాలికల వసతిగృహం సమీపంలో వృత్తి శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభిస్తారని వివరించారు. అనంతరం దివిటి పల్లి సమీపంలో ఉన్న ఐటీ టవర్‌ను పరిశీలన చేస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



## విశ్వవిద్యాలయానికి అదనపు స్థలం కేటాయించండి



కలెక్టర్ విజయేందిర బోయిని కలిసిన పీయూ ఉపకులపతి డా.జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి

**పాలమూరు, న్యూస్‌టుడే :** పాలమూరు విశ్వవిద్యాలయానికి అదనపు స్థలాన్ని కేటాయించాలని ఉపకులపతి డా.జీఎన్ శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిని కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ కార్యాలయంలో కలెక్టర్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పీయూలో వివిధ కళాశాలలు, అధ్యయన కేంద్రాలు, వసతి గృహాల భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన ఉపకార వేతనాలు, బోధన రుసుములను విడుదల చేసేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపకులపతికి అభినందనలు తెలిపారు. పీయూ అభివృద్ధికి చేయూత అందిస్తామని, అన్ని రంగాల్లో ప్రగతిలో నిలపాలని ఆమె కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పీయూ రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# చేదెక్కుతున్న చెరకు

ప్రత్యామ్నాయం వెతుకుతున్న రైతులు



చెరకు సాగు

**కొత్తకోట, న్యూస్‌టుడే:** అందరికీ(చక్కెర) తీపిని అందించే చెరకు రైతులు మద్దతు ధర లభించక, చేసిన వ్యవసాయంలో వచ్చిందంతా అప్పులు చెల్లించేందుకే సరిపోయి కుదేలవుతున్నారు. ఏటా పెరుగుతున్న విత్తనాల ధరలు, ఎరువులు, కూలీల వేతనాలు పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. సరైన దిగుబడులు లేక, చేతికొచ్చిన పంటకు మద్దతు ధర లేక కర్షకులకు కష్టాలే మిగులుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరకును మరిచి ఇతర పంటలకు మద్దతు ధర పెంచడం, బోనస్‌లు ఇవ్వడం వారిని పంట మార్పిడి వైపు చూసేలా చేస్తోంది.

**తగ్గుతున్న సాగు విస్తీర్ణం :** ఉమ్మడి జిల్లాలో ఉన్న కృష్ణవేణి చక్కెర కర్మాగారం పరిధిలో ఏడేళ్ల క్రితం ఆరు వేల మంది రైతులు 15 వేల ఎకరాల్లో చెరకు సాగు చేసేవారు. ప్రస్తుతం వీరి సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఉమ్మడి జిల్లానే కాకుండా పొరుగు జిల్లాలైన రంగారెడ్డి, వికారాబాద్ నుంచి కూడా చెరకు రైతులు ఉన్నారు. గతేడాది 5,950 ఎకరాల్లో చెరకు సాగు చేశారు. దాదాపు 2 వేల మంది ఈ పంట సాగు చేస్తుండగా యాజమాన్యం నుంచి తగిన ప్రోత్సాహం ఉండటం లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. ఒక్క సారి విత్తనాలు వేస్తే నాలుగేళ్లు పంట వస్తుంది. తొలి ఏడాది అధిక పెట్టుబడులున్నా తర్వాత ఏడాది పెట్టుబడి సమస్యలు అంతగా ఉండవని సాగులోకి దిగిన రైతులు ఏటికేడాది ఇక చాలు అని చెరకు సాగుకు దూరమవుతున్నారు. ప్రస్తుతం రైతులకు రికవరీ రేటు ఆధారంగా రూ. 3,340 మద్దతు ధర చెల్లిస్తున్నా అనేక కొర్రీలతో వారికి చేరే సరికి ఏమీ మిగలడం లేదని వాపోతున్నారు.

**ఖర్చు రూ.లక్ష పైమాటే :** ఎకరా చెరకు సాగు చేయాలంటే పెట్టుబడులన్నీ కలిపి తొలి ఏడాది రూ. లక్ష ఖర్చు చేయాల్సి ఉంటుందని కర్షకులు చెబుతున్నారు. గతేడాది కోత, రవాణా ఖర్చు టన్నుకు రూ. 1,100 చెల్లించాల్సి వచ్చింది. ఒక్కో ఎకరాకు సరాసరి 30 టన్నుల చెరకు పండుతుంది. ప్రస్తుత ధరతో పోలిస్తే రైతుకు రూ.లక్ష వస్తోంది. వీటిలో కోత, రవాణా ఖర్చులు మినహాయిస్తే మిగిలేది రూ. 77 వేలన్నమాట. ఏడాది పంట కోసం ఎరువులు, ఇతర పెట్టుబడులు అప్పుగా తేవాల్సిందే. అందుకు వడ్డీ చెల్లించాలి. ఇలా చెల్లింపుల్లో రవాణా కోత ఖర్చులు పోతే మిగిలింది ఎరువులు, ఇతర పెట్టుబడులకే సరిపోవడం లేదు. ఇక కౌలు రైతు పరిస్థితి మరీ దారుణం ఎకరాకు రూ. 15 వేలు కౌలు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా రైతుకు ఎక్కడికక్కడ నష్టం వాటిల్లుతున్న తరుణంలో ఇతర పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.



● స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధర రూ. 5,600 ఇవ్వాల్సి ఉంది. రికవరీతో సంబంధం లేకుండా కోత, రవాణా ఖర్చులు పోను రూ. 3,500 చెల్లించాలన్నది యాజమాన్యాలు అంగీకరించకుంటే వచ్చే ఏడాది సాగు మరింత తగ్గుతుంది. బోనస్‌ను పరిగణలోకి తీసుకుంటే వరి సాగు లాభసాటిగా ఉంది. పత్తి, వేరుసెనగ, ఆముదం వంటి పంటలు వేసుకున్నా లాభపడొచ్చు.

-రాజన్న, ఉమ్మడి జిల్లా చెరకు రైతు సంఘం అధ్యక్షుడు

## విద్యుత్తు శాఖా మేలుకో..



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు, తీగల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ఏ మాత్రం గాలి వీచినా తీగలు తెగి ప్రమాదాలకు తావిచ్చేలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం తిప్రాసుపల్లిలో ఓ రైతు పొలంలో కనిపించిన చిత్రమిది. విద్యుత్తు స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో కర్రలు ఊతంగా ఉంచి తీగలు వేలాడకుండా ఆ రైతు ఏర్పాటు చేసుకున్నారు.

- న్యూస్‌టుడే, నారాయణపేట

## భిన్న రీతిలో ఫ్లెక్సీలు




టైరోడ్ వద్ద గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

**కృష్ణా, న్యూస్‌టుడే:** ఏడాది క్రితం తమ కుమార్తె విజయలక్ష్మి ఆత్మహత్య చేసుకుంది. అందుకు అల్లుడు, అత్తమామలే కారణమని నారాయణపేట జిల్లా కృష్ణా మండలం గుడెబల్లూరుకు చెందిన చెన్నయ్యగౌడ్ ఆరోపించారు. నిందితుల ఆచూకీ తెలియచేయాలని కోరుతూ విభిన్న రీతిలో కృష్ణా మండలం టైరోడ్, మక్తల్, మరికల్, మహబూబ్‌నగర్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గత ఏడాది కర్ణాటక రాష్ట్రంలోని సేడం తాలూకా శంకరపల్లిలో తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడగా అక్కడి పోలీసులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. అత్తమామలు గ్రామం విడిచి వెళ్లిపోయారని తెలిపారు. వివాహ సమయంలో తమ కుమార్తెకు ఇచ్చిన కట్నకానుకలు తిరిగి ఇవ్వమని చెప్పి ఇప్పుడు కనిపించకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె కోసం తెలంగాణ, కర్ణాటకలో వెయ్యి బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు

**ఇటిక్యాల, న్యూస్‌టుడే:** పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. స్వామి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకొని కోదండ రామాలయంలో కల్యాణోత్సవం ఏర్పాటు చేశారు. తిలకించేందుకు భక్తులు జిల్లా నలుమూలల నుంచి బీచుపల్లికి తరలివచ్చారు. ఆలయ పండితుల వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల కోలాహలం, భాజాభజంత్రీల నడుమ కల్యాణం కమనీయంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ మేనేజర్ సురేందర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# చక్కని జీవన శైలితోనే ఆరోగ్యం పదిలం

● మధుమేహం, గుండె, ఈఎన్‌టీ సమస్యలపై వైద్యుల సూచనలు

ఈనాడు ETV అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన



ఆరోగ్య అవగాహన సదస్సుకు హాజరైన జనం

**న్యూస్‌టుడే, పాలమూరు:** అప్రమత్తత, చక్కని జీవన శైలితోనే వ్యాధులను దూరంగా ఉంచుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీనియర్ సిటిజన్లు, మహిళలు, యువత ఇలా.. అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించింది. చెవి, ముక్కు, గొంతు సంబంధ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్, మధుమేహం, ఇతర అనారోగ్యాలపై ప్రముఖ ఫిజీషియన్ డా.శ్రీనివాస్‌రెడ్డి, గుండె జబ్బులపై కార్డియాలజిస్ట్ డా.మహేశ్‌బాబు అవగాహన కల్పించటంతో పాటు సందేహాలు నివృత్తి చేశారు. చాలా ఏళ్లుగా మధుమేహంతో బాధపడుతున్న తాము ఇన్సులిన్ తీసుకుంటున్నామని, ఇది ప్రమాదకరమా అని కొందరు అడగ్గా అదేమీ కాదని, మాత్రల కంటే ఇదే నయమని వైద్యులు తెలిపారు. నిద్ర సమస్య ఉందని కొందరు చెప్పగా తగినంత శారీరక శ్రమ ఉంటే తప్పక నిద్ర వస్తుందన్నారు. ఐదేళ్ల నుంచి గొంతు కింద 'పెద్ద గడ్డతో' బాధపడుతున్నానని ఒకరు చెప్పగా జనరల్ ఆసుపత్రికి వస్తే చికిత్స అందిస్తామన్నారు. అనారోగ్యం వచ్చినప్పుడు వైద్యులను సంప్రదించకుండా నేరుగా మాత్రలు కొనుక్కుని, సామాజిక మాధ్యమాల్లో దొరికే సమాచారంతో సొంత వైద్యం చేసుకోవద్దని, ఇది చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ రోజూ 6 నుంచి 7 గంటలు నిద్ర పోవటంతో పాటు గంట పాటు వ్యాయామం చేయాలని, పోషకాహారం తీసుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, ఒత్తిడి లేకుండా జీవించడం అవసరమని తెలిపారు.

### పిండి పదార్థాలు తక్కువ తీసుకోవాలి



ప్రపంచంలోనే అత్యధిక మధుమేహం (డయాబెటిక్) బాధితులతో ఈ వ్యాధికి భారత్ రాజధానిగా మారింది. కార్బొహైడ్రేట్లు (పిండి పదార్థాలు) ఎక్కువగా ఉండే తెల్ల అన్నం, దుంపలు ఆహారంగా తీసుకునే అలవాటు ఉండటమే కారణం. గతంలో 40 ఏళ్ల తర్వాత ఈ వ్యాధి వచ్చేది. ఇప్పుడు 25 ఏళ్ల వారికి కూడా టైప్-2 వ్యాధి వస్తోంది. ఒత్తిడి, మానసిక సమస్యలతో సతమతం కావటం, కీళ్లు, ఇతర నొప్పుల మందులు, స్టెరాయిడ్ ఎక్కువగా వాడటం వల్ల కూడా వ్యాధి బారిన పడుతున్నారు. మధుమేహం వల్ల కంటి రెటీనా కూడా దెబ్బతింటుంది. గుండె, మూత్రపిండాలు, కాలేయం, నరాల బలహీనతలు, మంటలు తదితర సమస్యలు వస్తాయి. ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. మధుమేహం తీవ్రత ఎక్కువగా ఉన్నవారు ఇన్సులిన్ తీసుకోవాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు చేయించుకుంటూ ఆహారం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. కార్బొహైడ్రేట్లు ఉండే ఆహారం చాలా తక్కువగా తినాలి. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలి. ఆరోగ్యం కోసం, మధుమేహం నియంత్రణకు రోజూ 5 కి.మీ.ల మేర నడవటం చాలా ముఖ్యం.

- డా.శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ ఫిజీషియన్

### చెవిలో ఏది పడితే అది పెట్టకూడదు..



చెవి ద్వారా వినటమే కాదు దానితో పనులు జరుగుతాయి. అది చాలా సున్నితమైంది. చాలా మంది చెవిలో దురదగా అనిపిస్తే వెంటనే ఇయర్ బడ్స్, పుల్లలను పెట్టి అందులో ఉన్న వ్యర్థాలు బయటకు తీయడానికి ప్రయత్నిస్తారు. అలా చేయటం ఎంత మాత్రం మంచిది కాదు. వయస్సు పెరిగే కొద్దీ వినికిడి లోపాలు వస్తుంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రస్తుతం అనేక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. చిన్నపిల్లల్లో టాన్సిల్స్ వస్తుంటాయి. తర్వాత తగ్గిపోతాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చదువులో వెనకబడుతున్న చిన్నారుల్లో వినికిడి సమస్యలు కూడా ఉండే అవకాశం ఉంటుంది. పిల్లల్లో సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే చికిత్సలు చేయించాలి. చిన్నారులు సపోటా, శీతాఫలం వంటివి తినే క్రమంలో వాటి గింజలు కూడా మింగే అవకాశం ఉంటుంది. అవి శ్వాస నాళికలోకి వెళ్లి అడ్డుపడితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుంది. పసివాళ్లకు ఇలాంటి గింజలు అందుబాటులో ఉండకూడదు. నోటి క్యాన్సర్ రాకుండా నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. నోటిలో పుండు ఎక్కువ కాలం మానకపోతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఈఎన్‌టీ విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చాం. అన్ని రకాల చికిత్సలు అందిస్తాం. సద్వినియోగం చేసుకోవాలి.

- డా.సంపత్‌కుమార్ సింగ్, ఈఎన్‌టీ విభాగాధిపతి, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్

### బరువు పెరిగితే గుండెపై ఒత్తిడి..



బరువు అధికంగా పెరగడం వల్ల గుండెపై ఒత్తిడి పెరిగి హృద్రోగ సమస్యలు ఉత్పన్నమవుతాయి. ధూమపానం కూడా గుండె వ్యాధులకు దారితీస్తుంది. మహిళలతో పోలిస్తే గుండె జబ్బులు, మరణాలు పురుషుల్లోనే ఎక్కువ ఉంటాయి. రుతుస్రావం వల్ల మహిళలు ఆరోగ్యంగా ఉంటారు. నేడు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావటంతో గుండెపోటు వచ్చిన వారిలో 99 శాతం మంది బతుకుతున్నారు. బొడ్డు పైభాగం నుంచి గొంతు కింది భాగం వరకు గతంలో వచ్చిన నొప్పి కాకుండా కొత్త రకమైన తీవ్రమైన నొప్పి వస్తే అది గుండెపోటుకు సంకేతంగా భావించి వెంటనే అప్రమత్తం కావాలి. ఆయాసం, కళ్లు తిరగడం, చెమటలు ఎక్కువగా రావడం తదితర లక్షణాలు కూడా కనిపిస్తాయి. గుండెపోటు వచ్చిన మూడు నిమిషాల్లో వారికి సీపీఆర్ ప్రారంభించాలి. వెంటనే డిస్ప్రిన్ టాబ్లెట్ నాలుక కింద పెడితే గుండె పోటు తీవ్రతను తగ్గించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ వెంటనే సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించి వైద్యులకు చూపించి చికిత్సలు ప్రారంభిస్తే ప్రాణాలను నిలబెట్టవచ్చు.

- డా.మహేశ్‌బాబు

# దందా వెనక ఆ ముగ్గురు!



## జీరో ఇసుక పేరుతో అక్రమం

**గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్‌లో జీరో ఇసుక పాలసీ సరిహద్దులోని గద్వాల జిల్లాలో కాసులు కురిపిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇసుకాసురులు ఏకమై అధికారుల అండదండలతో జీరో ఇసుక పాలసీని ఇక్కడ యథేచ్ఛగా అమలు చేస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. వెనుక గద్వాల జిల్లాకు చెందిన అధికారపార్టీ బడా నాయకుడి భరోసా, అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్టు సమాచారం. సరిహద్దు గుండా ఒక ఇసుక టిప్పర్ జిల్లాలోకి అడుగు పెడితే అధికార పార్టీ నేతలు నెలకు రూ. లక్ష వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కర్నూల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి, అలంపూర్ పట్టణానికి చెందిన అధికార పార్టీ నాయకుడు, ఎర్రవల్లి చౌరస్తాలో ఓ యువకుడు ఇందులో ప్రధాన భాగస్వాములని తెలుస్తోంది.

**అధికార పార్టీ నాయకుడి హస్తం :** జిల్లాలో అధికారికంగా ఇసుక తవ్వకాలు జరగడం లేదు. ఇసుక తవ్వకానికి కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు అధికార పార్టీ నాయకుడికి మధ్య కమీషన్ల విషయంలో వివాదం ఏర్పడటంతో ఐదు నెలలుగా తవ్వకాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో మన ఇసుక, మన వాహనం కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఇసుక దొరకడం లేదు. తుమ్మిళ్ల రిచ్ వద్ద 40వేల టన్నుల ఇసుక అంటే సుమారు 2 వేల టిప్పర్ల ఇసుక డంపుల రూపంలో అందుబాటులో ఉండటంతో, ఈ ఇసుక కోసం 150 టిప్పర్ల యజమానులు మన ఇసుక, మన వాహనం కింద ప్రభుత్వానికి సొమ్ములు చెల్లించి నెలలు గడిచినా అందడం లేదు. మరోవైపు సరిహద్దుల గుండా బ్లాక్ మార్కెట్లో ఇసుక సులభంగా దొరుకుతోంది. అధికారికంగా ఇసుక డంపులు అందుబాటులో ఉన్నా, నిర్మాణదారులకు ఎందుకు అందడం లేదో అంతు చిక్కని విషయం. ఈ తతంగం వెనుక బడానాయకుడి హస్తం ఉన్నట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు మన ఇసుక, మన వాహనం కింద విక్రయించడానికి మీనమేషాలు లెక్కిస్తుండటం కూడా అనుమానాలకు తావిస్తోంది. మన ఇసుక, మన వాహనం కింద టన్ను ఇసుక రూ. వెయ్యి కాగా, బ్లాక్‌లో టన్ను ఇసుకను దళారులు రూ.2,800లకు విక్రయిస్తూ రోజూ లక్షలా ర్జిస్తున్నారనే నిర్మాణ రంగంలో ఉన్న పలువురు అంటున్నారు. గద్వాల పట్టణానికి రోజుకు 6 నుంచి 10 టిప్పర్లు (ఒక్కో టిప్పర్‌లో 30 నుంచి 42 టన్నులు) ఇసుక రవాణా అవుతోంది.



తుమ్మిళ్ల రీచ్ వద్ద ఇసుక నిల్వలు

**చేస్తున్నారు ఇలా..**

తుంగభద్ర నది అవతలి వైపున ఉన్న కర్నూల్ పట్టణ శివారు ప్రాంతాల నుంచి కర్నూల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఎర్రవల్లి చౌరస్తాకు చెందిన వ్యక్తికి మధ్య ఉన్న అవగాహన ప్రకారం ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల నుంచి తెలంగాణ సరిహద్దు అయిన గట్టు మండలంలోని బల్గెర వరకు టిప్పర్‌ను తీసుకుని వస్తారు. అక్కడి నుంచి ధరూర్ మీదుగా గద్వాల పట్టణానికి ఆ టిప్పర్ చేరుకునే విధంగా పక్కా ప్లాన్‌తో సరఫరా చేస్తున్నారని సమాచారం. పదిహేను రోజుల కిందట ఇలా మంత్రాలయం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ధరూర్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. కృష్ణానది అవతలివైపున్న వనపర్తి జిల్లాలోని రంగాపురం, రాంపురం గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా గద్వాల పట్టణానికి రవాణా జరుగుతోంది. ఎర్రవల్లి చౌరస్తాకు చెందిన ఓ యువకుడు ఇందులో కీలక సూత్రధారి. టీఎస్ఎండీసీ ప్రాజెక్టు అధికారి రంగారెడ్డి వివరణ కోసం సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

# ‘బెటాలియన్లు కావు.. రాచరికపు బంధిఖానాలు’




ఎర్రవల్లిచౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న పదో పటాలం పోలీసు కుటుంబాలు

**ఇటిక్యాల, న్యూస్‌టుడే:** ‘ఇవి బెటాలియన్లు కావు రాచరికపు బంధిఖానాలు’ అంటూ ప్రత్యేక పోలీసు కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఎర్రవల్లిచౌరస్తాలోని పదో పటాలంలో పనిచేసే పోలీసు కుటుంబాలలో కొందరు గురువారం సాయంత్రం ఒకే రాష్ట్రం.. ఒకే పోలీసు విధానం తీసుకురావాలంటూ ఎర్రవల్లిచౌరస్తాలోని జాతీయ రహదారిపై ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. 20 నిమిషాల పాటు జాతీయ రహదారిపై నిరసన తెలిపిన కుటుంబీకులకు ఇటిక్యాల, కోదండాపురం ఎస్ఐలు వెంకటేశ్, స్వాతి నచ్చచెప్పి నిరసన విరమింపజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. నెలలో 26 రోజులు డ్యూటీలు వేస్తుండటంతో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పటాలంలో ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా న్యాయం జరగలేదన్నారు. సివిల్, ఏఆర్‌లాగా ఒకే దగ్గర ఐదు సంవత్సరాలు డ్యూటీలు ఉంటూ కుటుంబాలను చూసుకునేలా మార్పులు తేవాలంటూ వారు డిమాండ్ చేశారు.

## ఎగువ జూరాలలో సాంస్కృతిక పోటీలు




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సూరిబాబు, చిత్రంలో సీఈ రామసుబ్బారెడ్డి

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** ఎగువ జూరాల జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలో గురువారం టీఎస్ జెన్‌కో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ పోటీలు కొనసాగుతాయి. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి జెన్‌కో సీఈ రామసుబ్బారెడ్డి, ఎస్ఈ సూరిబాబు మాట్లాడారు. ఉద్యోగులకు విధుల నిర్వహణతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలకు చెందిన పది విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల నుంచి 70 మంది అధికారులు, ఉద్యోగులు ఈ పోటీలకు హాజరయ్యారని తెలిపారు.

## తెగిపడిన హెచ్‌టీ తీగలు

కాలిన ఫ్యాన్లు, మీటర్లు ● ఒకరికి గాయాలు



జావిద్ కాలికి గాయాలు



జక్లేర్‌లో దగ్ధమైన మీటర్లు

**మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే:** హెచ్‌టీ విద్యుత్తు లైన్ తీగలు తెగి పడిన ఘటన మక్తల్ మండలం జక్లేర్ స్టేజీ వద్ద గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. జావిద్ ఇంటి ముందు ఉన్న హెచ్‌టీ లైన్ తీగలు తెగి ఎల్‌టీ లైన్‌పై పడిపోవడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. ఆ ప్రాంతంలోని నివాస గృహాల్లో 12 ఫ్యాన్‌లు, 10 విద్యుత్తు మీటర్లు కాలిపోయాయి. తీగపడిన క్రమంలో తూలిపడిన జావిద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే విద్యుత్తు ఉపకేంద్రానికి సమాచారం ఇచ్చి, సరఫరా నిలిపివేయించారు. ఈ ఘటనపై విచారణ చేస్తామని విద్యుత్తు శాఖ ఏఈ రామకృష్ణ తెలిపారు.

# ఇథనాల్ పరిశ్రమ పనులు అడ్డుకున్న ప్రజలు



పనులను అడ్డుకునేందుకు వచ్చిన గ్రామస్థులు

**రాజోలి, న్యూస్‌టుడే:** మా అభిప్రాయం తీసుకోకుండా ఇథనాల్ పరిశ్రమ ఎలా ఏర్పాటు చేస్తారంటూ పరిసర గ్రామాల ప్రజలు పనులను అడ్డుకున్న సంఘటన గద్వాల జిల్లా రాజోలి మండలంలో గురువారం చోటుచేసుకుంది. గాయత్రి సంస్థ వారు పెద్ద ధన్వాడ గ్రామ శివారులో రైతుల నుంచి 25 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి పరిశ్రమ ఏర్పాటుకు సన్నద్ధమయ్యారు. పరిశ్రమ ఏర్పాటుకు తీసుకున్న భూమి పక్కనే దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూమి 152 ఎకరాలు ఉంది. వీటితో పాటు చుట్టుపక్కల రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజుల కిందట పరిశ్రమ పనులు చేపట్టేందుకు రాగా ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. తిరిగి గురువారం సంబంధిత సంస్థ వారు పరిశ్రమకు అవసరమైన విద్యుత్తు స్తంభాలను, జేసీబీ, టిప్పర్, కంకర తీసుకురావడంతో పాటు గుడారాలను ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నసనూర్, మాన్‌దొడ్డి, చిన్నతాండ్రపాడు, నౌరోజి క్యాంపు ప్రజలు సంఘటన స్థలానికి చేరుకుని పనులను అడ్డుకుని సంస్థ సిబ్బందితో వాగ్వాదం చేశారు. సీఐ టాటాబాబు, తహసీల్దార్ రాంమోహన్, ఎస్సై జగదీష్ ప్రజలను నిలువరించి మాట్లాడారు. సంస్థ వారు అనుమతులు చూపకుండా పనులు ఎలా చేపడతారంటూ అధికారులను ప్రశ్నించారు. కాగా పరిశ్రమ ఏర్పాటుకు తమకు అన్ని అనుమతులున్నాయని సంస్థ వారు తెలిపినప్పటికీ వాటిని చూపకపోవడంతో పనులు నిలిపి వేసి వెళ్లిపోవాలని డిమాండు చేశారు. సీఐ, తహసీల్దార్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి అనుమతులు చూపించి పనులు ప్రారంభించాలని సూచించగా వారు పనులు ఆపేశారు. పరిశ్రమ ఏర్పాటు చేయకుండా చూడాలని ఈ సందర్భంగా ప్రజలు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

## రాయపురం క్వారీలో పేలుళ్లు: ఇద్దరికి గాయాలు



రాయి తగిలి గాయాలు

**గద్వాల, న్యూస్‌టుడే:** గట్టు మండలం రాయపురం శివారులో 199 సర్వే నంబర్‌లో భారత మాల పనుల కోసం క్వారీలో పేలుళ్లు జరపగా పక్కనే పొలంలో పనిచేసుకుంటున్న ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు.. గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో క్వారీలో పేలుళ్లు జరపటంతో బండరాళ్లు ఎగిసి పడి హరిజన తిమ్మప్ప కుమారుడు నవీన్, మరదలు పద్మమ్మకు గాయాలయ్యాయి. ఎలాంటి సమాచారం లేకుండా పేలుళ్లు జరపటంతో పక్కనే పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న వారు గాయపడ్డారని గట్టు పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు తిమ్మప్ప వివరించారు. పేలుళ్లకు అనుమతులున్నాయో లేదో తమకు తెలియదని, చుట్టు పక్కల రెండు కి.మీ. దూరం వరకు ప్రజలు, రైతులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత కంపెనీ ప్రతినిధులదని, ఆదేదీ చేయకుండా పేలుళ్లు నిర్వహించటం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని వారు వాపోయారు. ఈనెల 21 తేదీ నుంచి క్వారీలో బ్లాస్టింగ్ చేస్తున్నామని కంపెనీ ప్రతినిధులు సమాచారం ఇచ్చారని, సాయంత్రం 3 గంటల నుంచి ఐదు గంటల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సమాచారం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామని తహసీల్దార్ సరితారాణి పేర్కొంటున్నారు.

## ఆత్మహత్యకు యత్నించిన బాలిక మృతి

సీడ్ ఆర్గనైజర్‌పై కేసు

**మల్దకల్, న్యూస్‌టుడే:** బంగారం దొంగతనం చేసిందనే నెపంతో బాలిక (17)ను మల్దకల్ ఠాణాకు పిలిపించి విచారించగా ఆ అవమానం భరించలేక ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. కాగా బాలిక చికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. ఎస్సై నందికర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలిక ఈ సంవత్సరం మార్చి నెల నుంచి గద్వాలలోని బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో పనులు చేయడానికి చేరింది. ఆగస్టు నెలలో తన ఇంట్లో బంగారు గొలుసు పోయిందని దానిని బాలిక దొంగతనం చేసిందని అనుమానం వ్యక్తం చేసి అడిగారు. ఆ తర్వాత గొలుసు ఇంట్లోనే దొరికిందని చెప్పారు. తిరిగి అక్టోబరు 11న గొలుసు దొంగతనం చేసిందని మల్దకల్ ఠాణాలో రాజశేఖరరెడ్డి ఫిర్యాదు చేయగా పోలీసులు బాలికను, తల్లిని ఠాణాకు పిలిపించి విచారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాలిక అవమానం భరించలేక బిజ్వారంలో పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. చికిత్స నిమిత్తం గద్వాలకు అనంతరం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం బాలిక మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. బాలిక తల్లి కవిత ఫిర్యాదు మేరకు సీడ్‌ఆర్గనైజర్ రాజశేఖరరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నందికర్ వివరించారు.

### చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫాంరేటు | 120–00 |
| రిటైల్ | 142–00 |
| డ్రెస్డ్ | 206–00 |
| స్కిన్‌లెస్ | 234–00 |

## తెరపై ఈనాడు

శ్రీనివాస - **విశ్వం**, తిరుమల - **వెట్టియాన్**, బాలాజీ - **పొట్టేల్**, వెంకటేశ్వర - **దేవర**, వెంకటాద్రి - **లగ్గం**, మైత్రి శ్రీకృష్ణ - **వెనమ్ త్రీడి** (తెలుగు)

– న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

## 29న ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

**మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే :** రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అండర్-14,17 బాల, బాలికల జట్ల ఎంపికలు ఈ నెల 29న మహబూబ్‌నగర్‌లోని డీఎస్‌ఏ మైదానంలో చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బోనఫైడ్, ఆధార్ ప్రతులతో ఉదయం 10 గంటలకు మైదానంలో కోచ్ ఖలీల్‌ను 98853 45211 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## ఎల్‌ఆర్‌ఎస్ స్థలాల పరిశీలన



దేవరకద్రలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే :** దేవరకద్ర పట్టణ కేంద్రంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి ప్లాట్లను పరిశీలించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు అధికారుల వద్ద ఉన్న వివరాలను సరిచూసుకోవాలన్నారు. ప్లాటులో ఇంటి నిర్మాణం చేపట్టాలనుకుంటే ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించాలని సూచించారు. అనంతరం ప్లాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ శరత్ పాల్గొన్నారు.

## గ్రంథాలయ పనులు వేగవంతం చేయండి

**కోయిలకొండ, న్యూస్‌టుడే :** గ్రంథాలయ నిర్మాణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో రూ.60లక్షలతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రంథాలయంలో పాఠకులు, నిరుద్యోగుల కోసం పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, ఇతర మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసి పాఠకులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఆయన వెంట కార్యదర్శి మనోజ్‌కుమార్, డీఈ రాము, గుత్తేదారు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ధన్వంతరి జయంతి అధికారికంగా నిర్వహించండి

**మహబూబ్‌నగర్ సాంస్కృతికం :** శ్రీధన్వంతరి స్వామి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నాయీబ్రాహ్మణుల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి అధ్యక్షుడు సనాతన బాలరాజు కోరారు. గురువారం హైదరాబాదులో మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి ధన్వంతరి జయంతిని నిర్వహించాలని వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు ఎం.రవి, నర్సిములు, సనాతన బాలస్వామి, నారాయణ ఉన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం.. తరలుతున్న పత్తి

**పూర్తిస్థాయిలో ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు**

**తక్కువకు కొంటున్న దళారులు, కర్ణాటక వర్తకులు**



ఊట్కూరు వద్ద బారులుతీరిన పత్తి వాహనాలు

న్యూస్‌టుడే, కోస్గి

**పత్తి** పంటపై రైతులు పెట్టుకున్న ఆశలను వర్షాలు దెబ్బతీశాయి. ఉన్న పంటను అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా దళారులకు తెగనమ్ముకుంటున్నారు. పెద్ద ఎత్తున పంట కర్ణాటకకు తరలిపోతోంది. కొందరు రైతులు పత్తి తీసి ఇళ్లలో నిల్వ చేశారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తి నాని ఇబ్బందులు పడుతున్నారు. భారతీయ పత్తి సంస్థ (సీసీఐ) ఆధ్వర్యంలో మార్కెటింగ్ అధికారులు కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సిద్ధమయినా, నేటికీ అందుబాటులోకి రాకపోవడంతో అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరుసగా వర్షాలు కురుస్తుండడంతో తేమశాతం పెరుగుతుందని, అందుకే అధికారులు వెనుకడుగు వేస్తున్నారని రైతుసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు

**కర్షకుల నిరసనలు:** ధన్వాడలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉండవల్లి శివారులోని జాతీయ రహదారి పక్కనున్న పత్తి మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలో జిన్నింగ్ మిల్లులకు కొందరు తరలిస్తున్నారు. నారాయణపేట, గద్వాల జిల్లాల్లోని సరిహద్దు ప్రాంతాల్లో కర్ణాటక దళారులు పంటను తరలిస్తున్నారు. కోస్గి, మద్దూరు, గండీడ్ మండల రైతులు వికారాబాద్ జిల్లా తాండూరులో విక్రయిస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో జిన్నింగ్ మిల్లులు ఉన్నప్పటికీ వాటిని ఆలస్యంగా ప్రారంభిస్తుండడంతో దళారులు రంగప్రవేశంచేసి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో సాగు ఇలా..**

| జిల్లా | 2022 | 2023 | 2024 |
|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 1,15,380 | 85,830 | 79,128 |
| నారాయణపేట | 2,05,807 | 1,84,597 | 1,85,150 |
| నాగర్‌కర్నూల్ | 3,52,429 | 2,35,530 | 2,10,970 |
| వనపర్తి | 21,689 | 17,411 | 12,301 |
| జోగులాంబ గద్వాల | 2,22,908 | 1,44,075 | 1,20,597 |

**ఉమ్మడి జిల్లాలో సాగు ఇలా..:** ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో 5.88 లక్షల ఎకరాలలో పత్తి సాగు అయ్యింది. గత ఏడాది కన్నా కొంత తగ్గింది. 41.19 లక్షల కింటాళ్ల పత్తి దిగుబడి ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే పత్తి తేమశాతం 8 నుంచి 12 లోపు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని గతంలో అధికారులు సూచించారు.

### తక్కువ ధరకు అమ్ముకున్నా..



**ఈ** ఏడాది 9 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశాను. సుమారు 70 క్వింటాళ్ల పత్తి వచ్చింది. క్వింటా రూ.6,150 చొప్పున గ్రామంలోనే వ్యాపారులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువకు విక్రయించాను. సీసీఐ కొనుగోలు కేంద్రం ఉంటే క్వింటాకు కనీసం రూ.వెయ్యి అదనంగా వచ్చేది. నాకన్నా తక్కువ అమ్ముకునేవారూ ఉన్నారు. రైతుల వేదన అధికారులు ఆలకించాలి.

- చిన్న మద్దిలేటి, రైతు, చెన్నిపాడు

**ఉన్నతాధికారులకు నివేదించాం..:** సీసీఐ కేంద్రం ఏర్పాటు గురించి అలంపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొడ్డెన్న, వైస్ ఛైర్మన్ కొమ్ముకుమార్, ఉన్నతాధికారులతో చర్చించానని, దీపావళి తర్వాత కేంద్రం ఏర్పాటయ్యే అవకాశాలున్నట్లు అలంపూర్ మార్కెట్ యార్డు కార్యదర్శి యల్లాస్వామి అన్నారు.

## నిరాశ్రయుల కేంద్రంలో సౌకర్యాలు కల్పించండి

### అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆదేశం



సీహెచ్‌వో రాము నాయక్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, చిత్రంలో పుర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

**పాలమూరు పురపాలకం, పాలమూరు, న్యూస్‌టుడే :** నిరాశ్రయుల కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆదేశించారు. గురువారం ఆయన పురపాలక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, మెప్మా ఇన్‌ఛార్జి పీడీ సురేందర్‌రెడ్డి, మెప్మా డీఎంసీ శివకుమార్‌తో కలిసి జిల్లా ఆసుపత్రి ఆవరణలో ఉన్న నిరాశ్రయుల కేంద్రాన్ని పరిశీలించారు. ఎలాంటి రక్షణ లేకుండా, అపరిశుభ్రత, దుర్వాసనతో ఉన్న నిరాశ్రయుల కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ నిరాశ్రయుల కేంద్రం ఉండాల్సింది ఇలా కాదని అసంతృప్తి వ్యక్తంచేశారు. కేంద్రాన్ని సమూలంగా మార్చాలని కమిషనర్, పీడీలకు పలు సూచనలు చేశారు. నిరాశ్రయుల కేంద్రానికి ముఖద్వారంతో పాటు పకడ్బందీగా గేటు ఏర్పాటు చేయాలని, నిరాశ్రయుల రాకపోకలపై నిఘా కోసం సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని చెప్పారు. నిరాశ్రయుల కేంద్రంలో ఉంటున్న వారి రేషన్ లేదా ఆధార్ కార్డుల వివరాలు సేకరించాలన్నారు. నిరాశ్రయులు ఉండే భవనంతో పాటు మూత్రశాలలు, మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి ఆవరణను శుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. నిరాశ్రయుల కేంద్రాన్ని పక్కాగా నిర్వహించాలని పర్యవేక్షకులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ నిరాశ్రయుల కేంద్రం పరిశీలిస్తున్న క్రమంలోనే ఆసుపత్రికి చెందిన ఓ ఉద్యోగి అక్కడకు చేరుకున్నారు. నిరాశ్రయుల కేంద్రం ఉన్న భవనం తమ యూనియన్‌దని, దాన్ని అప్పగించాలని కోరారు. ఇది ప్రభుత్వ అధీనంలోనిదని, సంఘం కార్యకలాపాలకు మరో ప్రత్యామ్నాయం చూసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రి ఆవరణలో ఈ దుర్గంధమేంటి? చెత్తకుప్పలు ఇలాగే ఉంటాయా? పారిశుద్ధ్య సిబ్బంది ఏం చేస్తున్నారని అదనపు కలెక్టర్ ఆ ఉద్యోగిని ప్రశ్నించారు. పారిశుద్ధ్య పనులు కాంట్రాక్టు ఇచ్చామని, పర్యవేక్షణకు సూపర్‌వైజర్ ఉంటారని తెలిపారు. సూపర్‌వైజర్ ఎక్కడ ఉన్నారో పిలవండి అంటూ అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సూపర్‌వైజర్ రాగా ఆసుపత్రి ఆవరణలో దుర్గంధం, అపరిశుభ్రతపై ప్రశ్నించి వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. కమిషనర్ వెంటనే పురపాలక సిబ్బందిని పురమాయించి చెత్తకుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

## క్రికెట్‌లో జాతీయ స్థాయికి ఎదగాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్పీ వెంకటేష్

**మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే :** హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్ర స్థాయి అండర్-23 టోర్నీకి ముందస్తుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలను సద్వినియోగం చేసుకుని ఎదగాలని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్పీ వెంకటేష్ అన్నారు. గురువారం ఎండీసీఏ మైదానంలో రెండో రోజు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికవ్వాలన్నారు. రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిస్తే తప్పకుండా రంజీ, ఐపీఎల్ స్థాయికి ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు టి.సురేశ్ కుమార్, ఒలింపిక్ సంఘం ప్రతినిధి సోహెల్, శిక్షకుడు అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

**నారాయణపేట జట్టు విజయం.. :** ఎండీసీఏ మైదానంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీలో రెండో రోజు నిర్వహించిన మ్యాచ్‌లో నారాయణపేట జట్టు కొడంగల్ జట్టుపై 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన కొడంగల్ జట్టు 16.5 ఓవర్లలో 35 పరుగులకు ఆలౌట్ అయ్యింది. నారాయణపేట బౌలర్లలో రోహాన్, అద్నాన్ చెరో 3, ఎజాజ్ 2 వికెట్లు తీశారు. అనంతరం నారాయణపేట జట్టు 6.1 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అద్నాన్ 17, తరుణ్ 12 పరుగులు చేశారు.

## జాతర మైదానంలో ఏర్పాట్లు

**మదనాపురం, న్యూస్‌టుడే :** శ్రీకురుమూర్తి స్వామి జాతర బ్రహ్మోత్సవాలకు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానుండటంతో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలయ ప్రధాన ముఖద్వారం రాజగోపురానికి రంగులు వేస్తున్నారు. జాతర మైదానంలోని మూత్రశాలలు, మరుగుదొడ్ల గదులకు మరమ్మతులు చేపట్టారు. ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో ఏపుగా పెరిగిన మొక్కలతో పాటు పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. కొండ దిగువ భాగంలో వ్యాపారులు గుడారాలను వేసుకునేందుకు మైదానాన్ని చదును చేస్తున్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు సన్నాహాలు

**అడ్డాకుల :** రాచాలలో వచ్చే నెల 2 నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంఈవో కురుమూర్తి కోరారు. ఎమ్మార్సీలో గురువారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మండల పీడీలు, పీఈటీలను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడాకారులకు వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

## కాలానుగుణ వ్యాధులపై దృష్టి పెట్టండి



అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకుడు డా.రవీంద్రనాయక్

**పాలమూరు, న్యూస్‌టుడే :** జిల్లాలో కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకుడు డా.రవీంద్రనాయక్ ఆదేశించారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కోయిల్‌కొండలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన అనంతరం మహబూబ్‌నగర్ ఐడీవోసీ కార్యాలయంలోని డీఎంహెచ్‌వో విభాగంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం పూర్తి కానుండటంతో, శీతాకాలం ప్రారంభ దశలో చిన్నారులు, వృద్ధుల్లో శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ఆసుపత్రులను రిజిస్ట్రేషన్ చేయించి విధిగా తనిఖీలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఆర్‌ఎంపీలు అనేక రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారని, అలాంటి వారిపై నిఘా పెట్టాలన్నారు. ప్రథమ చికిత్స మాత్రమే వారు చేయాలని, పరిధి దాటితే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం డెంగీ, జ్వర బాధితుల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాల్లో పర్యవేక్షణ చేయాలన్నారు. ఆయా ఆసుపత్రుల్లో ఎక్కడైనా మందుల కొరత ఉంటే వాటిని పంపించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తగినంత ఔషధాలను సరఫరా చేస్తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.శ్రీధర్‌రెడ్డి, జిల్లా మలేరియా అధికారి డా.శశికాంత్, డీఐవో డా.పద్మజ, పీవో ఎంహెచ్‌ఎన్ డా. భాస్కర్ నాయక్, డా.రఫిక్, ఏవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసుల నమోదును నిరసిస్తూ ధర్నా



చిన్నచింతకుంట : ధర్నా చేస్తున్న భారాస నాయకులు, కార్యకర్తలు

**చిన్నచింతకుంట :** చిన్నచింతకుంట మండలం పర్దీపూర్ గ్రామంలో రైతు భరోసా అమలు కోరుతూ ఈనెల 20న నిర్వహించిన ఆందోళనలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడంపై కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తూ గురువారం చిన్నచింతకుంటలో భారాస శ్రేణులు ధర్నా నిర్వహించారు. మాజీ ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, భారాస మండల అధ్యక్షుడు కోట రాములు మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన నిర్వహించిన తమ పార్టీ కార్యకర్తలు 25 మందిపై కేసులు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి మోహన్ గౌడ్, జేఏసీ కన్వీనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, రాము పాల్గొన్నారు.

**భూత్పూర్ :** ఏడాదికి మూడు పంటలకు రైతు బంధు ఇవ్వాలని గతంలో డిమాండ్‌చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రైతులకు పంటసాయం అందించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని పురపాలక సంఘం అధ్యక్షుడు, భారాస మండల అధ్యక్షుడు బస్వరాజుగౌడ్ ఆరోపించారు. భూత్పూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పిందని మండిపడ్డారు. మాటతప్పిన ప్రభుత్వాన్ని రైతులు ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు పెట్టి భయపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నాయకులు నారాయణగౌడ్, మురళీధర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు వెంకట్రాజు, నర్సిములు యాదవ్, సురేష్, తిరుపతయ్య పాల్గొన్నారు.

## క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో అక్రమాలు

**నిధులు రికవరీ చేసేందుకు అధికారుల తాఖీదులు**



గుడిమల్కాపూర్‌లో బోర్డుకే పరిమితం

**న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ వ్యవసాయం :** హన్వాడ మండలంలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఒక్కో పంచాయతీలో రూ.30వేల నుంచి రూ.70వేల వరకు అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలో 35 గ్రామ పంచాయతీలు ఉండగా 19 పంచాయతీల్లోనూ అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఇటీవల నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో బయట పడింది. ఇందుకు ఉపాధి హామీ ఇంజినీరింగ్ అధికారులు సహకరించారన్న ఆరోపణలున్నాయి.

**పనుల పరిస్థితి ఇదీ.. :** 2022లో హన్వాడ మండలంలో ఒక్కో పంచాయతీలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు ఉపాధి హామీ కింద రూ.2 లక్షల నిధులు కేటాయించారు. ఇందులో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడలు ఆడేందుకు కోర్టులు ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో భూమి చదును, మొరం వేయటం, ప్రాంగణ బోర్డు ఏర్పాటు చేసేందుకు సర్పంచులకు అధికారం ఇచ్చారు. పనులు పూర్తిచేయకపోయినా చేసినట్లు చెప్పారు. ఎంబీలు కూడా తయారు చేయగా ఉపాధి హామీ పథకం సాంకేతిక అధికారులు బిల్లులు జారీ చేశారు.

**గ్రామాల వారీగా ఇలా.. :** కొద్ది రోజుల క్రితం ఉపాధి హామీ పనులపై అధికారులు సామాజిక తనిఖీ చేపట్టారు. ఇందులో 19 గ్రామ పంచాయతీల్లో రూ.6,52,230 నిధులు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. అత్యధికంగా శేక్‌పల్లిలో రూ.71,809 తప్పుదారి పట్టినట్లు గుర్తించారు. వేపూర్‌లో రూ.42వేలు, రాంనాయక్‌తండాలో రూ.36వేలు, అమ్మపూర్‌తండాలో రూ.35వేలు, అచ్చకుంటతండాలో రూ.31వేలు, కొరంతండాలో రూ.33వేలు, నాగంబావితండాలో రూ.32వేలు పక్కదారి పట్టినట్లు నివేదిక ఇచ్చారు. చాలా చోట్ల నాణ్యత లేని పైపులు వేశారని గుర్తించారు. ఈ నేపథ్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు ఆయా పంచాయతీలకు నోటీసులు ఇచ్చారు. పక్కదారి పట్టించిన నిధులను వెంటనే చెల్లించాలని ఆదేశించారు. ఆయా గ్రామాల మాజీ సర్పంచులు ఎంబీలు చేసిన అధికారుల నుంచి తమకు డబ్బులు రావాలంటున్నారు. టంకర పంచాయతీ కార్యదర్శి మాత్రం వెంటనే రూ.29వేలు ప్రభుత్వానికి చెల్లించారు. ఎంపీడీవో యశోదను 'న్యూస్‌టుడే' సంప్రదించగా నిధులు గ్రామ పంచాయతీల జనరల్ ఫండ్ నుంచి రికవరీ చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ సాంకేతిక సిబ్బంది వల్ల తప్పులు జరిగాయన్నారు.



బుద్దారం పాఠశాలలో ఏర్పాటు చేసిన బోర్డు

## దేవాలయ అభివృద్ధికి సహకరించాలి

**బాలానగర్, న్యూస్‌టుడే :** అయ్యప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి సహకరించాలని దేవాలయ కమిటీ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నిర్వహణాధికారి శ్రీనివాసులు అన్నారు. పెద్దాయపల్లి గ్రామ శివారులోని అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం పాలకవర్గం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నవంబర్ మొదటి వారం నుంచి మాలధారణ వేస్తున్న సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. డిసెంబర్ 18న నిర్వహించనున్న మహాపడి పూజ, ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు సహకరించాలని కోరారు. మాజీ సర్పంచి శంకర్, కమిటీ సభ్యులు గిరిధర్ రెడ్డి, సాయరెడ్డి, సాధువెంకట్‌రెడ్డి, మహేందర్ రెడ్డి,తిరుపతి, లక్ష్మీనారాయణగౌడ్, శ్రీను, యాదగిరిగౌడ్, రాములు, తదితరులు ఉన్నారు.

## సంత్ సేవాలాల్ ఉత్సవ సమితి కార్యవర్గం

**నవాబ్‌పేట, న్యూస్‌టుడే :** మండల సంత్ సేవాలాల్ ఉత్సవ సమితిని గురువారం ఏకగ్రీవంగా చేశారు. అధ్యక్షుడిగా నీల్యానాయక్, గౌరవ అధ్యక్షులుగా చందర్‌నాయక్, లింబ్యానాయక్, రాజునాయక్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహా నాయక్, ఉపాధ్యక్షులుగా శంకర్‌నాయక్, తారాసింగ్‌నాయక్, గోవింద్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, కోశాధికారిగా తరుణ్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, కార్యదర్శులుగా హరినాయక్, భాస్కర్‌నాయక్, ప్రేమ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా చందు, మంగ్యా, రవి, రాజులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్టీలు వేరైనా ప్రతి ఒక్కరూ గిరిజనుల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు.

## పొగాకు ఉత్పత్తులతో దుష్ఫలితాలు

**నవాబ్‌పేట, న్యూస్‌టుడే :** పొగాకు ఉత్పత్తులను పూర్తిగా నిషేధించాలని వైద్యాధికారి డా.రఫీక్ సూచించారు. గురువారం మండల వైద్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పొగాకు వాడకం వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. యువత పొగాకు ఉత్పత్తులను దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీజ, సిబ్బంది శ్రీనివాసులు, శరభలింగం, జయశీల, విజయ, భవానీసింగ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మెట్టు దిగిన విస్తరణాధికారులు

**మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే :** కొన్ని రోజులుగా పంటల సర్వేలో పాల్గొనలేమన్న వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు (ఏఈవోలు) మెట్టు దిగారు. బుధవారం వ్యవసాయ శాఖ రాష్ట్ర సంచాలకుడు గోపితో జరిగిన చర్చల తర్వాత గురువారం ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల పంటల సర్వే చేపట్టారు. దాదాపు 80 శాతం మంది విస్తరణ అధికారులు గ్రామాలకు వెళ్లి సర్వే చేశారు. గత నెల 24 నుంచి వారు పంటల సర్వే చేపట్టకుండా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై రాష్ట్ర కమిషనరేట్ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పలు దఫాలుగా చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోయింది. చివరకు కొందరు ఏఈవోలపై సస్పెన్షన్ వేటు వేయటంతో పరిస్థితి చేయిదాటకుండా ఉండేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరిపారు. వ్యవసాయ శాఖ మంత్రి, కమిషనర్ మలేషియాలో ఉన్నారని, వచ్చాక సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో ఏఈవోలు సర్వేలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే:** రీజియన్‌లోని 10 డిపోల్లో పని చేస్తున్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి, సంయుక్త కార్యదర్శి విజయబాబు కోరారు. గురువారం ఈ మేరకు ఆర్టీసీ ఆర్ఎం వి.శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు. అవుటాఫ్ డిసగ్నేషన్ ఎత్తివేయాలన్నారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. అనారోగ్యం బారిన పడిన సిబ్బందికి నేరుగా వైద్యుల ద్వారా లేఖ ఇప్పించి సెలవు తీసుకున్న రోజులకు వేతనం ఇవ్వాలన్నారు. టిమ్ యంత్రాల స్థానంలో కొత్త వాటిని ఇవ్వాలన్నారు. మహిళా కండక్టర్లకు సెలవులు ఇవ్వాలని కోరారు.

## నాలుగో రోజూ పంటల టెండర్లకు ఇబ్బందులు

**జడ్చర్ల, న్యూస్‌టుడే :** సాంకేతిక సమస్య వల్ల నాలుగో రోజు కూడా వ్యవసాయ మార్కెట్లలో ఈ-నామ్ పద్ధతిలో టెండర్ల ప్రక్రియ జరగలేదు. ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లతో పాటు బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మ్యానువల్‌గా అధికారులు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. 'ఇ-నామ్‌కు సాంకేతిక సంకటం' అనే శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ఈ విషయంపై రాష్ట్రవ్యాప్త మార్కెట్లలో అధికారులు, వ్యాపారులు, రైతుల్లో చర్చ కొనసాగింది. మార్కెట్ కార్యదర్శులు, జిల్లా మార్కెటింగ్ అధికారులు సమస్యను పరిష్కరించాలని ఉన్నత అధికారులకు లేఖలు రాశారు. సాంకేతిక సమస్య ఇంకా పరిష్కారం కాలేదని, జిల్లాలోని ఈ-నామ్ మార్కెట్లలో సాధారణ టెండర్ల ప్రక్రియతోనే పంట కొనుగోళ్లు చేపట్టినట్టు జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి తెలిపారు.

**ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు** **జడ్చర్ల, న్యూస్‌టుడే :** ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై జడ్చర్ల ఠాణాలో గురువారం కేసు నమోదైంది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. మద్యం లోడుతో ఉన్న వనపర్తి జిల్లా పెబ్బేరు గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్‌కు చెందిన లారీని తోలుతున్న డ్రైవర్ యూసుఫ్ షా బుధవారం రాత్రి జడ్చర్ల కొత్త బస్టాండు సమీపంలో భోజనం చేయడానికి హోటల్ వద్ద ఆపాడు. ఆ సమయంలో మరో లారీ వచ్చి వెనక నుంచి ఢీకొనడంతో మద్యం లోడుతో ఉన్న లారీ ఒక పక్కకు ఒరిగిపోయింది. అందులోని మద్యం కార్టన్లు కిందపడ్డాయి. డ్రైవర్‌కు గాయాలు కాగా మద్యం లారీ దెబ్బతింది. నిర్లక్ష్యంగా లారీని నడిపి తన లారీకి నష్టం కలిగించిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

**వివాహిత ఆత్మహత్య** **పటాన్‌చెరు, న్యూస్‌టుడే:** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ ఠాణా పరిధిలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వివాహిత(27) భర్తతో కలిసి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి కిష్టారెడ్డిపేటలో ఉంటోంది. కొన్ని నెలలుగా ఆమె వీడియో కాల్‌లో సాయిచరణ్ అనే వ్యక్తితో మాట్లాడుతుండగా ఈ విషయాన్ని భర్త ఆమె తల్లికి చెప్పాడు. ఆమె కుమార్తెను నిలదీసింది. బుధవారం సాయంత్రం సమయంలో సాయి చరణ్‌తో వీడియో కాల్‌లో మాట్లాడుతూ ఊయల కొక్కేనికి చీర తగిలించి ఆత్మహత్యకు పాల్పడింది. తన కుమార్తె తిరస్కరించినా సాయిచరణ్ అనే వ్యక్తి పదే పదే వీడియో కాల్స్ చేశాడని, ఆమె మృతికి అతనే కారకుడంటూ తల్లి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

**ఇంట్లో ఉరేసుకుని మరొకరు..** **జడ్చర్ల, న్యూస్‌టుడే :** మద్యానికి బానిసైన వ్యక్తి భార్యతో గొడవ పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామంలో గురువారం వెలుగు చూసింది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గోపాల్(38) గతంలో గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేసేవాడు. మద్యానికి బానిసై విధులు నిర్వర్తించకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. భార్య రేణుకతో బుధవారం రాత్రి మద్యం కోసం డబ్బులు ఇవ్వమని గొడవపడ్డాడు. మద్యం మత్తులో ఆమెపై కత్తితో దాడికి యత్నించాడు. భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి పక్కనే ఉండే బంధువుల ఇంటికి వెళ్లి వెళ్లి పడుకున్నారు. ఇంట్లో ఒక్కడే ఉన్న గోపాల్ అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

**కుక్కల నుంచి నెమలిని రక్షించిన వృద్ధుడు** **జడ్చర్ల, న్యూస్‌టుడే :** నెమలిపై కుక్కలు దాడి చేస్తుండగా గుర్తించిన వృద్ధుడు దాన్ని రక్షించి పోలీసులకు అప్పటించారు. జడ్చర్ల మండలం మల్లెబోయినపల్లి గ్రామానికి చెందిన ఆదిరాల రాములు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. జాతీయ రహదారి-44పై ఉన్న మల్లెబోయినపల్లి సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలోకి నెమలి రాగా కుక్కలు దాడి చేశాయి. అటుగా వెళ్తున్న రాములు గుర్తించి కుక్కలను తరిమివేశారు. నెమలిని పోలీస్ స్టేషన్‌కు తీసుకవచ్చి ఎస్సై శివానంద్‌కు అప్పగించారు. జాతీయ పక్షిని రక్షించిన రాములను ఎస్సై అభినందించారు. అనంతరం పోలీసులు అటవీ శాఖ అధికారులకు నెమలిని అప్పగించారు.



నెమలిని ఎస్సై శివానంద్‌కు అప్పగిస్తున్న రాములు

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



ఏకలవ్య గురుకులంలో వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎస్సై తిరుపాజీ

**బాలానగర్, న్యూస్‌టుడే:** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తిరుపాజీ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులకు తమ వ్యక్తిగత సమాచారాన్ని చెప్పకూడదన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్, ఏకలవ్య, టీఆర్‌జీఎస్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించగా ఆయన పరిశీలించారు.

**పాలమూరు, న్యూస్‌టుడే :** సైబర్ నేరగాళ్ల అనేక రకాల మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెండో పట్టణ ఠాణా సీఐ ఏజాజోద్దీన్ తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు పలు రకాల నేరాలపై అవగాహన కల్పించారు. ప్రణాళికాబద్ధంగా సైబర్ నేరగాళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఫోన్లు చేస్తారని తెలిపారు. తక్కువ ధరకు వస్తువులు ఇస్తామని, ఉద్యోగాలు కల్పిస్తామని, రుణాలు ఇస్తామని, ప్రాజెక్టుల్లో వాటా కల్పిస్తామని, బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని, పోలీసులమని చెప్పి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. చరవాణులకు వచ్చే లింక్‌ను తెరవవద్దని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్ తిరస్కరించాలని సూచించారు. మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని, సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు.